# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **భారతదేశ వారసత్వ సంపద చరిత్ర మాత్రమే కాదు, ఒక శాస్త్రీయ అంశమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ఈరోజు నుండి ప్రారంభమవుతాయి.**

**3.** **వర్ష ప్రభావిత గ్రామాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.**

**4.** **పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభమవుతున్నాయి.**

**5.** **అల్పపీడన ప్రభావంతో రాగల 48 గంటలలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.**

**6.** **ప్రముఖ కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్యులు జయంతి ఈ రోజు.**

==========================

భారతదేశ వారసత్వ సంపద చరిత్ర మాత్రమే కాదు, ఒక శాస్త్రీయ అంశమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని భారత్ మండపంలో ప్రపంచ వారసత్వ కమిటీ 46వ సమావేశాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలోని పురాతన నాగరికతలలో ఒకటైన భారత్ లో ప్రపంచ వారసత్వ కమిటీ కార్యక్రమం నిర్వహించడం హర్షణీయమన్నారు..వారసత్వ సంపద పరిరక్షణకు ప్రపంచ సహకారాన్ని పెంపొందించుకోవడంతో పాటు స్థానిక సమాజాన్ని భాగస్వామ్యం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. యునెస్కో ప్రపంచ వారసత్వ కేంద్రానికి భారత్ మిలియన్ డాలర్లను విరాళంగా అందిస్తోందన్నారు. ప్రపంచ వారసత్వ ప్రదేశాల పరిరక్షణ సామర్థ్యం పెంపు, సాంకేతిక సహాయానికి ఈ నిధులు ఉపయోగపడతాయని పేర్కొంటూ....

..వాయిస్...30 సెకన్లు....

-------------------------

ఆంధ్రప్రదేశ్ శాసన సభ సమావేశాలు ఈ రోజు నుండి ప్రారంభమవుతాయి. ఈరోజు ఉదయం పది గంటలకు రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ శాసన సభ, శాసన మండలి సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన సభా వ్యవహారాల

సలహా సంఘం–బీఏసీ సమావేశమై శాసన సభలో ప్రవేశ పెట్టవలసిన అంశాలు, సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలి అనే అంశాలను నిర్ణయిస్తుంది. కాగా శాసనసభ సమావేశాలు అయిదు రోజుల పాటు జరిగే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వచ్చే మూడు నెలలకు సంబంధించిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ఈ సమావేశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఓటు ఆన్ అకౌంట్ బడ్జెట్ కాల పరిమితి ఈ నెలాఖరుతో ముగుస్తోంది. మరో వైపు .... భూహక్కు చట్టం రద్దు బిల్లును ప్రభుత్వం రేపు సభలో ప్రవేశపెట్టనున్నట్టు సమాచారం.

---------------------------

వర్ష ప్రభావిత గ్రామాల్లో ప్రతి కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని పెద్దవాగును మంత్రి నిన్న పరిశీలించారు. పెద్దవాగు ఆనకట్ట. మరమ్మతు పనులపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ప్రతి గ్రామంలో అధికారులు పర్యటించాలని సూచించారు. ప్రతి ఇంటికి వైద్యసిబ్బందిని పంపించాలని.. డెంగ్యూ వంటి విషజ్వరాలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఇంటింటికి బియ్యం, కూరగాయలు వంటివి సరఫరా చేయాలని తెలిపారు.

---------------------------

పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరిగేలా చూసే బాధ్యత ప్రభుత్వం, ప్రతిపక్షం రెండింటిపైనా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిన్న ఢిల్లీలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సమావేశం అనంతరం కిరణ్ రిజిజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రతి అంశం చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. బడ్జెట్ సమావేశాలు సజావుగా జరిగేలా అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. కాగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభమవుతున్నాయి. రేపు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక సర్వేను ప్రవేశపెడతారు. కాగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఆరు కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుందని లోక్ సభ సచివాలయం తెలిపింది.

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలువురు కాంగ్రెస్ నాయకులతో ముఖ్యమంత్రి ఈ రోజు సమావేశకానున్నారు. కాగా ఢిల్లీలోని అధికారిక నివాసంలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌లతో ముఖ్యమంత్రి రేవంత్ నిన్న సమావేశమయ్యారు. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు, పరీక్షలు, కమిషన్ విచారణ తదితర అంశాలపై సమీక్షించారు. ఢిల్లీలో జరిగిన జాతీయ డ్యాం భద్రతా సంస్థ – ఎన్‌డీఎస్‌ఏ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు ఢిల్లీలో జాతీయ డ్యాం భద్రతా సంస్థ ఆధ్వర్యంలో జరిగే సమావేశంపై అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

---------------------------

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో క్రమంగా నీటి ప్రవాహం పెరుగుతోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం 10

అడుగులకు చేరింది. దీంతో 7.5లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి, డెల్టా కాలువలకు 1800 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. అలాగే విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకి వరద ఉద్ధృతి కొనసాగుతోంది. గత రాత్రి ప్రకాశం బ్యారేజీకి 13,634 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. దీంతో బ్యారేజీ 17 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి సముద్రంలోకి 12,325 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజీ నీటిమట్టం 12 అడుగులుగా ఉందని అధికారులు తెలిపారు.

మరోవైపు తెలంగాణలోని భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గత రాత్రి వరకు గోదావరి నీటి మట్టం 41.09 అడుగులుగా ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటి వల్ల భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఇంకా పెరుగుతుందని జల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. వరద నీరు పెరగడంతో భద్రాచలం చర్ల మండలంలోని ఈత వాగుపై నుంచి వరద నీరు పారడంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు వెళ్లే ప్రధాన రహదారిపై వరద నీరు చేరడంతో తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

---------------------------

ఒడిశా–ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్న వాయుగుండం అల్పపీడనంగా బలహీనపడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాగల 24 గంటలలో ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ వెల్లడించింది. వర్షాల కొనసాగుతుండటంతో అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాలలోని విద్యాసంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు.

వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో హైదరాబాద్ సహా కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కొమురంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఆయా జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది. ఉరుములు మెరుపులతోపాటు గంటకు 30కి.మీ నుంచి 40కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

---------------------------

ప్రముఖ కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్యులు జయంతి ఈ రోజు, తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలనపై ఎక్కుపెట్టిన ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్యులు, నా తెలంగాణ కోటి రతనాల వీణ అని గర్వంగా ప్రకటించారు. నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరిచేందుకు ఎన్నో పాటలు రాశారు. 1925 జూలై 22న మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిన్నగూడూరులో జన్మించిన ఆయన... ఉపాధ్యాయుడిగా, ఆకాశవాణి ప్రయోక్తగా సేవలందించారు. పలు తెలుగు చలన చిత్రాలకు గేయాలు, అనేక కథలు, నాటికలు రచించిన దాశరథి 1987 నవంబర్ 5న తుదిశ్వాస విడిచారు.

---------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గత సాయంత్రం విజయవాడలోని రాజ్

భవన్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. ఆంధ్రప్రదేశ్ లో శాంతిభద్రతలు క్షీణించాయని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై దాడులు జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించినట్టు ఆ పార్టీ నాయకులు తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

======================